ఈగలు

శ్రీ డి. ప్రభాకర్

సుజాత పంతొమ్మిదేళ్ళ క్రితం పుట్టినది. పుట్టిన పదేళ్ళకి ఆ అమ్మాయికి సినిమా కోరిక—సినిమా చూడాలన్న కోరిక పుట్టింది. సుజాత ఆ కోరికను అడపదడపా వాళ్ల అమ్మావాళ్లతోనో లేపోతే పక్కింటివాళ్లతోనో వాళ్ళూళ్లోవున్న ఏకైక టూరింగుటాకీసుకు వెళ్లి తీర్చుకుంటుండేవి. అయినా ఆ కోరిక తీరక, కనీసం తరగక సుజాతకంటే ఆలీసంగా పుట్టినా సుజాతకంటే వేగంగా పెరిగి పెరిగి యిష్టంగా మారి కూచుంది.

సుజాత పెరుగుతున్న సినిమా యిష్టంతో ఎదుగుతూ ఏటేటా వాళ్ల హైస్కూల్లోని ఒక్కో మెట్టు యెక్కుతూ ఓ ఏడు ఆ స్కూలుతాలూకు ఒకేఒక అంతస్తును చేరుకుని 'యింతేనా! యింత కంటే పైకిపోయే అవకాశమేలేదా...లేదా..అని దిగులుగా దిగులుదిగులుగా చూసింది. అచ్చొచ్చిన వాళ్ల నాన్న గారు జాలిపడ్డారు. అవకాశమిస్తే బిడ్డ పైచదువులు చదూకుంటుందని సంబరపడ్డారు. అలా సంబరపడినందుకు ఓనాడు వాళ్ళావిడతో గొడవపడి మర్నాడు సుజాతను అదెదోవూరు—[చిన్నవాళ్ళల్లో చిన్నవాడూ కాదు పెద్దవాళ్ళల్లో పెద్దవాడూకాదు అంటారే, అల్లాగు ఆవూరు పల్లెల్లో పల్లేకాదు పట్నాల్లో పట్నంవూ కాదు!]— ఆ వూళ్లో వుంటున్న వాళ్ల 'పెద్దబ్బాయ్'దగ్గర చేర్చేరు.

పెద్దబ్బాయ్‌దగ్గర చేరిన సుజాత కాలేజీలో చేరింది. కాలేజీలో చేరేంతవరకూ, చేరిన కొన్నాళ్ల వరకూ సుజాత విరివిగా సినీమా ల్చూసేసింది. మొట్ట మొదటిసారి ఆ అమ్మాయి 'సినిమా వెళ్తానన్నయ్యా' అని పెద్దబ్బాయ్ నడిగినప్పుడు అతగాడు నవ్వుతూ 'అలాగే వెళ్లిరా' అన్నాడు. అని చెల్లెల్తోపాటు తన పెళ్ళాన్నికూడా తోడు పంపేడు.

సినిమాహాల్దగ్గర వదిన రూపాయి ముప్పై పైసల టిక్కెట్లు కొంటున్నప్పుడు సుజాత అప్పటి వరకూ థర్డుక్లాసులో పొనవుతున్నదల్లా ఒఖ్ఖసారి ఫస్ట్‌క్లాసు సంపాయించినట్లు సంబరపడిపోయింది. పల్లెటూరి ముప్పావలా టూరింగ్‌టాకీస్‌కి రెండు రెట్లెదిగిపోయాం అని ఆనందపడిపోయింది. ఆ ఆనందంతో హాల్లోకెళ్లిన సుజాత ఆశ్చర్యపడిపోయింది— తన రూపాయిముప్పై పైసల క్లాసువెనుక, దాన్నెత్తైన యింకా ఖరీదైన క్లాసుల్ని చూసి! పండిన ఆశ్చర్యంతో వెళ్లి వెనకవరసలో ఓ కుర్చీలో కూర్చుంది. కూర్చున్నాక ఆసక్తి నిండినకళ్లతో కిందనున్నవాడు నిచ్చెనెక్కినవాణ్ణి తలెత్తి చూసినట్టు వెనక్కితిరిగి ఖరీదైన క్లాసుకేసి చూసింది.

వెనక లావుపాటికుర్చీ వరుసలున్నై. వాటిలో జనం వున్నారు. జనం వాడెవడో రాజాధిరాజు ఏర్పాటు చేసిన సభకొచ్చిన సామంతరాజుల్లా, రాణీల్లా వున్నారు. రాజులమాటకేంగాని రాణీలు కట్టుకున్న చీరెలు, పెట్టుకున్న నగలు, చేసుకున్న అలంకారాలు తెల్లని నునుపైనకార్డుమీద అచ్చొత్తిన బంగారపు అక్షరాల్లా వున్నై. సుజాతకి వాళ్ళనీ, వాటినీ చూసే కొద్దీ ముచ్చటేసింది. ముచ్చటేసి 'అంత అందంవైన చీరెలు వాళ్ళు కట్టుకుంటేనే అందం, అంత విలువైననగలు వాళ్ళు పెట్టుకుంటేనే అందం. అసలు స్వర్గానికి సోపానాల్లావున్న ఆ సీట్లలో వాళ్ళు కూచుంటేనే అందం' అనుకుంది. తననుకున్నమాటను వాళ్లొదినొత్తో చెప్పింది.

వదిన అది విని భళ్ళున నవ్వింది. నవ్వి అంది –

'వెర్రి సుజా! టైంకోసం గడియారంగానీ గడియారంకోసం టైంకాదు. అలాగే చీరెలందం వాళ్లదిగాని వాళ్ల అందం చీరెదిగాదు. అసలామాట కొస్తే వాళ్లు కట్టుకున్న చీరెలు నువ్ కట్టుకుంటే, వాళ్ల అలంకారాలు నువ్ చేసుకుంటే వాళ్లకంటే నువ్వే అందంగా వుంటావ్. అంత అందంతో ఆ కుర్చీలో కూచున్నావంటే వాళ్లకంటే నువ్వే హుందాగా వుంటావ్!'

అంతా విని 'నిజవా?' అనుకుంది సుజాత. ఆ ఒక్కసారేకాక 'నిజవా నిజవా' అని చాలచాలా సార్లు అనుకుంది. అలా అనుకుంటూనే మరో టనుకుంది—'బక్కచిక్కిన ఎద్దున్తీసికెళ్లి మునిసిపాలిటీ బండిక్కడితే మునిసిపాలిటీ ఎద్దవుతుంది. దాన్నే తీసికెళ్లి కొమ్ములకి రంగులేసి రంగురంగుల గుడ్డలు కప్పితే అదే గంగిరెద్దవుతుంది—మనంవూ అంతే!'—అని! ఇలా అనుకున్నాక ఆ అమ్మాయికి వదిన చెప్పింది నిజవే అనిపించింది. అలా అనిపించటం ఆలస్యం ముప్పావలా కలాసికి బంగారపుక్యాపు [మాయబంగారపుదే కావొచ్చు] వున్నట్టు సుజాత పెంచుకున్న సినిమా యిష్టంచుట్టూ కొన్ని ఖరీదైన కోరికలు రెక్కలు కట్టుకొచ్చిచేరినై. అయితే ఆ కోరికలు శ్రీరామాంజనేయయుద్ధం పద్యాల్లా అయిదారు గ్రామఫోనురికార్డుల్లో లేవుగాని సినిమాల్లోని 'సోలో'పాటలా ఒకేఒక రికార్డుగా వున్నై.

సుజాత ఆ కోర్కెల రికార్డు పెట్టాలంటే వరమిచ్చే దేవుడే దిగిరాఖర్లేదు—ఓపిగ్గా వినే వాళ్లుంటే చాలు. అసలొక్కోప్పుడు అలా వినేవాళ్లు గూడా వుండఖర్లేదు—తనే ఒంటిగా కూచుని రికార్డు వేసుకుని విని ఆనందించగలదు. (విని ఏడ్వనూ గలదు. అది వేరే విషయం.)

సుజాతనీ విధంగా నవ్వించి, ఏడ్పించి యిష్టం వొచ్చినట్లల్లా ఆడించగల రికార్డులోని కోర్కె లేవిటయ్యా(మ్మా) అంటే......

......రానున్న సినిమాకి మూడ్రోజులముందుగా సినిమాహాల్దగ్గరికి నౌకర్నిపంపి మొదటి తరగతి ప్రేక్షకుడి నెత్తినుండే రిజర్వుడు క్లాసుకి టిక్కెట్లు రిజర్వు చేయించుకోనుట, అలా రిజర్వు చేయించుకున్న సినిమాకి రిజర్వు పోలీసులా ఏళ్లునిండిన డ్రస్సులోకాకుండా అప్పటికప్పుడు బజార్నుండో చీరె, అప్పుడే విమానం దిగొచ్చిన సిల్కుచీరె (విమానం సిల్కు కాదుస్మీ) తెప్పించి తన వంటికి నప్పించి అందమైన ప్లిమత్కారులో (ఖర్మ! మనకి రోల్సు రాయిస్ లుంటేనా?) సినిమాకి వెళ్లుట, అక్కడ జనమంతా తనని ప్రపంచసుందరిని చూసినట్లు పంచప్రాణాలూ విస్మయం పంచ నొదిలేసి చూచుట, తనేమో సగర్వంగా, 'భలేపెళ్లి' శతదినోత్సవాని కొచ్చిన నటీమణిలా హుందాగా నడిచివెళ్లుట, యిలా యింకాసిని'ట' లున్నై.

అయితే యీ కోరికలన్నీ తీరినట్లేనా?

నన్ను చెప్పనీండి మరి!!

ఓరోజు, దేశంలో అన్నిసమస్యలూ సస్యశ్యామలంగావున్నరోజు. సస్యశ్యామలంగావున్న సమస్యల్తో దేశం అతిమామూలుగావున్నరోజు సుజాత మామూలుకంటే కాస్త ఆలీసంగా నిద్రలేచింది. ఎదురుగావున్న వెంకటేశ్వరస్వామి క్యాలెండర్కేసి చూస్తూ 'అబ్బ! అప్పుడే ఫిబ్రవరొచ్చేసినట్టుందే' అని బద్ధకంగా ఆవలించి ఓచిన్న చిటికె వేసింది.

మరి సుజాత ఫిబ్రవరొచ్చేసినట్టుందే అన్నందుకో, ఆవలించి చిటికివేసినందుకో తెలీదుగాని మొత్తానికి సుజాతలోని సుజాతకు—మనస్సుజాతకు-కూడా మెలకువొచ్చేసింది. రాగానే కళ్లైనా నులుముకోకుండా తెలుగు సినిమాలోని హిందీ బాణీల్లానో, హిందీ సినిమాలోని యింగ్లీషు బాణీల్లానో గబగబ అనేసింది—

'హేపీ బర్త్డే టూ యూ! హేపీ బర్త్డే టూ యూ సుజాతా!!'

'హరి నా! యివేళ నా పుట్టిన్రోజన్న సంగతే

మరిచిపోయేను !' అని కొన్నంత ఆశ్చర్యపోయింది సుజాత. తర్వాత 'యివ్వాళ నా పుట్టిన్రోజు' అని మురిసిపోయింది. వెంటనే పక్కింటిజామ్మగారు 'ఏవే పిల్లా వచ్చేజ్యేష్ఠంలో నీ పెళ్ళిటగా' అనడిగితే సిగ్గుపడినట్టు సిగ్గుపడిపోయింది. అలా సిగ్గులోపడి యింతకీ లేవకపోయేసరికి మనస్సుజాత కస్సుమంది—

'నువ్వలా సిగ్గుపడిపోవటమేనా లేక యివాళ పండగచేసేదేవన్నా వుందా?'

'అన్నిపండగలు నేచేస్తున్నానా యిది చేసేందుకు'—సుజాత చిన్నబుచ్చుకున్నట్టుగా అంది.

'అన్నిపండగలు అందరివీ! ఇది నీది! నువ్వెళ్ళి ఆ చేసేవాళ్ళకి 'యివాళ నా పుట్టిన్రోజు' అన్చెప్తే తెలుస్తుంది. అంతేగానీ...అడగంది అమ్మైనా పెట్ట దన్నారు'.

సుజాత కాటే సామెతలు తెలీవు. అయితే తనకు తెలిసిన సామెతల్లో చాలా నిజాలున్నాయని తెలుసు !

సుజాతకు అడగందే అమ్మైనా పెట్టదన్న సామెత తెలుసు!! అంచేత 'సరే చెప్పిచూదాం'అని మంచంమీంచి లేచింది. అడిగేందుకు అమ్మలేదుగనక అమ్మలాటి వదినదగ్గరకెళ్ళి పీట వాల్చుక్కూచుంది.

'ఏవిటివ్వాళ అలస్యంగా లేచావ్? ఆదివారమనా?'—వదిన—పొయ్యి, పొయ్యిమీదున్న గిన్నెమీంచి దృష్టి మరల్చకుండా సుజాత నడిగింది.

'ఊఁ! అద్సరేగానొదినా అసలు పుట్టిన్రోజు పండుగెలా చేసుకుంటారుట?'

'నీకు తెలీదా? నువ్వెప్పుడూ పుట్టిన్రోజు పండుగ జరుపుకోలేదా '

'అబ్బ! అన్నీ తెలిసినవాళ్ళతో యిదే బాబా చావు! అడిగింది చెప్పకుండా అడ్డుప్రశ్న లేస్తుంటారు !'

అన్నీ తెలిసిన వాళ్ల జాబితాలో తనను చేర్చేసరికి వదినకి సుజాతమీద అభిమానం—అది వరకే వుండేమో—అదికాస్త అధికమైంది. దాంతో కండెనవేసిన చక్రంలా మెత్తగా నవ్వుతూ పొయి కెదురుగావున్న పీటని సుజాతకేసి తిప్పుకుంది. గుళ్ళోదాసుగారు భక్తులకి శ్రీ సత్యనారాయణ వ్రత మాహాత్మ్యం చెప్పినట్టు పుట్టిన్రోజు గురించి చెప్పింది.

'చెప్పేందుకేముంది సుజా! ప్రతిరోజూ శుభ్రంగా స్నానం చేస్తున్నా పుట్టిన్రోజునమాత్రం మరింత శుచిగా తలంటుకు స్నానం చేస్తారు. యింటో పాతబడని బట్టలున్నప్పటికీ కావాలని కొత్త బట్టలుకొని కట్టుకుంటారు. దేవుళ్ళకీ పెద్దవాళ్ళకీ నమస్కారాలు పంచేస్తారు. తర్వాత తాహతునుబట్టి తమ ఆనందాన్ని విందులద్వారా పంచిపెడ్తారు!'

'అయితే వదినా యిల్లాంటి పండగల్చేసుకోవటం మంచిదేనంటావా?'

'వూళ్ళో వాళ్ళందర్నీ పిలవటం, పెద్ద పెద్ద పార్టీలివ్వడం మినహాయిస్తే యీ పండుగ జరుపుకోవటంలో తప్పేమీ లేదంటాను! ఎంచేతంటే బ్రతికినంతకాలం మాట దేవుడెరుగు ఆ ఒక్క రోజన్నా ప్రతిఒక్కరూ రాజులానో. రాణీలానో గడపొచ్చు!'

'మరైతే వదినా యివాళ నా పుట్టిన్రోజు!!'

'నిజంగా?'—వదిన ముఖంలోని నవ్వు ఆదివారం నాటి కరంటులా తక్కున ఆగిపోయింది.

'నిజంగానే వదినా! ఫిబ్రవరి ఫస్ట్ నా బర్త్డే!'

'అయితే ఆ విషయం ముందే చెప్పక నా చేత యింత వాగుడెందుకు వాగించావ్? అలా వాగించకపోతే నీ పుట్టిన్రోజు సరిగా చేయనని భయమేసిందా?? నీ పుట్టిన్రోజనగానే ఏదో తలంటిపోసి యింత బెల్లం ముక్క నోట్లో వేస్తానని అనుమానం వేసిందా??'

"ఛ ఛ! అలాటిదేవీ లే దొదినా ! ఒట్టు!"—

మరెలాటిదుందో చెప్పలేక సుజాత ముఖం అమాయకంగా పెట్టేసింది. ముఖంలోనే వుంటున్నది కాబట్టి నోరూ, నోట్లోంచొచ్చేయిగనక మాటలూ అమాయకంగా (రుగా) వున్నై.

ఒక టిక్కెట్టుమీద రెండు సినిమాల్చూసినట్టు ఒక్క సుజాతలో అమాయకమైన అన్నింటిని చూసేసరికి వదినకి జాలేసింది. అంచేత సుజాతకేసి ఓ జాలి చూపేసింది—సుజాతో మాటాడిన మాటల్లో జాలి వుంపేసింది –

'పిచ్చి సుజా! ఏదేనా చెప్పేందుకూ, చెప్పి చేయించుకుందుకూ నాదగ్గర బిడియమెందుకు ? లే.. లే...స్నానం చేద్దువుగాని.'

సుజాత లేచింది.

వదిన కూడా లేచింది. లేచి గబగబ ముందు గదిలో గడ్డం గీసుకుంటున్న పెద్దబ్బాయ్ దగ్గర కెళ్లి—' ఏవండీ! యివ్వాళ సుజా పుట్టినరోజట' అంది.

'అల్లాగా! వెరీ గుడ్! అయితే యివాళ స్పెషలేం చేస్తున్నావ్ ?'

'నే చేసేదేదో నే చేస్తాగాని ముందు మీరు బజారెళ్లి అమ్మాయికో చీరె పట్టండి!'

సుజాత వదిన మాటల్నీ, మాటల్లోని సలహాని, ఆజ్ఞని కూడా వింది. అందువల్ల వదిన మాటలకి అన్నయ్య సమాధానం కూడా వినాలనిపించి గడ పవతలగా నిలబడి చెవుల్ని గడ పివతల పడేసింది.

పెద్దబ్బాయ్ సుజాత నిలుచున్న ద్వారంకేసి చూస్తూ నవ్వుతూ –

'పుట్టినరోజు పండక్కి చీరె కొనాలని రూలు పెట్టుకుంటే మీ ఆడాళ్లకి సంవత్సరాని కొక్క చీరె కంటె ఎక్కువ దక్కదు! అలా కాకుండా చీరె కొన్నప్పుడే పండుగ చేసుకుంటే నాలుగైదు చీరెలూ పండగలూ తగలొచ్చు. ఏమంటావ్ బేబీ!'

బేబీ అని పిలవబడ్డ సుజాత ఏమీ అన్లేదు.

వదినమాత్రం పెద్దగా 'అదిగాదండీ...' అంటూ వంగి పెద్దబ్బాయ్ చెవులో యేదో చెప్పింది. మరి పెద్దబ్బాయ్‌కి చెవులు దురదెత్తాయే యేమో ముఖం విసుగ్గా పెట్టి 'ఏంవీ అనుకోర్లే ఫో' అన్నాడు.

'సరె మీ యిష్టం' అంటూ వదిన అవతల కెళ్లి 'రా సుజా' అంది.

సుజాత వదినవెంట వెళ్లింది.

వదిన చెప్పినట్టు తలస్నానం చేసింది. యిస్త్రీ చీరె కట్టుకుంది. దేవుడికీ, పెద్దబ్బాయికీ నమస్కారాల్చేసింది. వదినచేసి పెట్టినవేవో తినేతినట్టు తింది. ఆ తర్వాత వదిచ్చెప్పినవేవో చేసింది.

అన్నీ యిష్టంలేని పెళ్లికూతుర్లా దిగులుగా చేసింది.

చేసి దిగులుగానే వెళ్లి మంచంమీద పడుకుని మనస్సుజాతను బయటకు తీసి చీవాట్లు పెట్టింది.

'అసలు నీ వల్లే జరిగిందింతా! ప్రొద్దున్నే లేచి 'హేపీ బర్త్‌డే' అంటూ హడావుడీ చేశావ్. ఆ విషయమే జ్ఞాపకం రాకుండా వుంటే యే బాధా వుండేదికాదు!'

'నాకేం తెలుసూ యిలా జరుగుతుందనీ! అయినా యిప్పుడు మించి పోయిందేవీ లేదు. ధైర్యే సాహసే సరికొత్త చీరె అన్నారు. వెళ్లి పెద్దబ్బాయ్‌ని దబాయించు. 'పుట్టినరోజున ఆడపిల్లచేత పాత చీరె కట్టించి కంటతడి పెట్టిస్తున్నావ్! అనుభవిస్తావ్!!' అని బెదిరించు దారికొస్తాడు'

'గుడ్‌లే! స్కాలర్‌షిప్పులమీద చదూకుంటున్న దాన్ని. అంత ధైర్యం ఎక్కడేడిసింది?'

'అయితే ఓ పన్చెయ్. తెలుగు సినిమాలోలా సీరియస్‌గా పెద్దబ్బాయ్ ముందునుంచి గోడనున్న గ్రూప్ ఫోటో దగ్గరకెళ్లి 'అమ్మా...నాన్నా నేను మీ దగ్గరుంటే నా పుట్టినరోజిలా జరిగేదేనా! ఎంత మంచి బట్టలు కొనిపెట్టేవారూ. ఎంతమందికి విందుచేసేవారూ...ప్చ్.. ఇక్కడ ......యిక్కడ......

అంటూ ఏడుప్. దాంతో పెద్దబ్బాయ్ గాడిపొయ్యి లోని చింతమొద్దులా పశ్చాత్తాపంతో దహించుకుపోయి రెండు చీర్లు కొన్పెడతాడు.'

'ఏడిసినట్టుంది నీ ఆలోచన!'

'అయితే ఏడుప్!'

'హంతకన్నా వేయగలిగిందేముందిలే...' అనుకుంటూ నిట్టూర్చింది సుజాత. ఆ నిట్టూర్పటం నిట్టూర్పటం సాయంత్రంవరకూ నిట్టూర్చింది. అసలు రాత్రివరకూ పాడిగిద్దామనుకుందిగానీ అప్పుడే బజార్నుండి పెద్దబ్బాయ్ హడావుడిగా వచ్చేడు. సుజాతను పిలిచేడు. పిల్చి—

'బేబీ చీరె కొనుక్కుందువ్గాని బజారుకెళ్దాం రా' అన్నాడు.

సుజాత పక్కనేవున్న పెళ్ళాన్నిచూసి — 'నువ్ చీరె కొనుక్కోఖర్లేదుగానీ నువ్వూ రావోయ్ బజారుకి' అన్నాడు.

అతడలా అన్న అయిదునిముషాల్లో తయారై వచ్చింది సుజాత.

అతడలా అన్న అరగంటగ్గాని రాలేదు వదిన.

వాళ్ళిద్దరూ వచ్చిన మరుక్షణంలోనే పెద్ద బ్బాయ్ చేతిలో పుస్తకం అవతలపడేసి లేచేడు.

ముగ్గురూ యింటికి తాళంపడేసి, రోడ్డంట నడక సాగించేరు. ఆమాటా యీమాటా మాట్లాడుకుంటూ కొంతదూరం నడిచేసరికి మాటలైపోయినటు మౌనం వహించేరు. అలా కాస్త దూరం వెళ్ళేక మౌనం భరించలేనట్టు వదిన అంది—

'యింకెంత దూరం బాబూ నా కాళ్ళు నొప్పెడుతున్నై!

'అన్నయ్యా వూళ్ళకి వూళ్ళు నడుస్తాడు. నడవమంటాడు. అంతేగాని కారుమాత్రం కొనడు'— సుజాత ముద్దుగా అంది. అన్నాక అన్న య్యేమంటాడోనని బెరుగ్గా చూసింది.

పెద్దబ్బాయ్ ఏమీ అన్లేదు. నవ్వీసేడంతే;

ఆ నవ్వునూ్చసిన సుజాత— 'అరె! యిలా తేలిగ్గా నవ్వేస్తాడనుకుంటే 'ఓస్ పిచ్చొదినా! మన కాళ్ళు నొప్పెట్టినా, నొప్పెట్టిన కాళ్ళు సంకెళ్ళు పడ్డట్టు కదల్లేకపోయినా మా అన్నయ్యకు కన్ను అదిరినట్టైనా వుండదు. మన్చేత డబ్బు మోయిస్తాడే గాని డబ్బుమీద మన్ని సావరీ చేనీడు' అందునే!— అనుకుంది. దీంతర్వాత మరోటి అనుకోబోయేంతలో బట్టలషాపొచ్చేసింది.

ట్యూబ్ లైట్లలో వెలుగుతున్న షాపుని కంచంలో అన్నాన్ని చూసినట్టు ఆకలిగా చూస్తూ అన్నా వదిన్లతో లోపలికెళ్ళింది సుజాత.

లోపల బీరువాలున్నై: బీరువాల కద్దాలున్నై. అద్దాల్లోంచి చీరెలూ, మరి యితర గుడ్డలతాన్లూ కన్పిస్తున్నై—హోటల్ బీరువాలో పేర్చిపెట్టిన జాంగ్రీల్లా, లడ్డుల్లా, ...ల్లా,...ల్లా! అలా కన్పిస్తున్నవాటిని కళ్ళారా చూస్తుంటే సుజాత మనసూరింది. మనస్సుజాత గిలిగింతలు కలిగేలా అంది—

'యిప్పుడు అన్నయ్య నిన్ను హోటల్కి తీసికెళ్ళిన ఫ్రెండులా 'యేం తీసుకుంటావ్ బేబీ' అనడుగుతాడు. నువ్వేమో మొహంవాటపడీపడనట్టు పడుతూ, నవ్వీనవ్వనట్టు నవ్వుతూ 'ఆ బ్లూ చీరె పక్కనున్న...ఎర్రఅంచు...తెల్లచీర...' అన్చెప్తావు. అన్నయ్య పర్సుతీసి ఆ చీరె ఖరీదు కొట్టువాడికిస్తాడు. కొట్టువాడు నీకు చీరె యిస్తాడు. యిహ నువ్వేమో ఆ చీర కట్టుకుని అప్సరసలా...'

'ఛీ పోవే!' అంది సుజాత లోలోపలే మురిసిపోతూ. మురిసిపోతూనే పెద్దబ్బాయ్ 'ఏం బేబీ ఏం తీసుకుంటావ'ని అడుగుతాడేమోనని చూసింది. అలా ఎంతసేపు చూచినా పెద్దబ్బాయ్ అడగటం మాత్రం చూళ్ళేక పోయింది.

దాంతో 'అన్నయ్య అలా అడగడు. హోటల్కి తీసికెళ్ళినా ఫ్రెండులాకాక పెద్దమనిషిలా ఖరీదైన చీరెల్లన్నిటిని నా ముందు కుప్ప వేయిస్తాడు. అందు

లోంచి మంచి చీరె నోదాన్ని ఎన్నుకోమంటాడూ' అనుకుంది.

ఆ అమ్మాయ్ అలా అనుకుని అర్నిముషమైనా కాలేదు 'ఏం కావాలండీ' అనడిగిన సేల్సుమన్‌కి జవాబుగా పెద్దబ్బాయ్—' పాతిక ముప్పై రూపాయల్లో మంచి చీరేదన్నా వుంటే చూపించండి' అన్నాడు.

'పాతిక ముప్ఫై రూపాయల్లోనా??'— సుజాత క్కోప మొచ్చింది. రిక్షావాడికోపమొచ్చింది. కడుపులో ఆకలి కళ్లల్లో ప్రాణాలూ పెట్టుకుని, రిక్షాలో కొండంత మనిషి నెక్కించుకుని, రిక్షా తొక్కి తొక్కి కోటదగ్గరకు చేరిస్తే, కొండంత మనిషి యిబ్బందిగాదిగి కోసంత జేబులోంచి వెతికి వెతికి వరకలాంటి పావలాకాసు తీసిచ్చినప్పుడు రిక్షావాడికొచ్చే కోప మొచ్చింది!

కాని అప్పుడే ఆ అమ్మాయికోటి జ్ఞాపకం వచ్చింది. అలా జ్ఞాపకం వచ్చిందీ తనకోపమె తనశ్రతువు పద్యంకాదు—దాన్తాలూకు తాత్పర్యం. ఆ తాత్పర్యం కాస్తా గుర్తొచ్చేసరికి సుజాతలోని కోపం పెరిగి పోదామనుకున్నదల్లా కాస్తంత తాత్సారం చేసింది. అది కనిపెట్టిన శాంతం పందెం గెలిచేసింది. అప్పుడు శాంతవతియైన సుజాత అంత వరకు కోపంతో బిగపట్టిన పళ్లనూ, గట్టిగా పీల్చిన గాలినీ వదిలేసింది. వదిలేసి—కోప్పడి యేం చెయ్యగలం! అప్పడాల పిండి జీవితం వెళ్లదీస్తున్న వాళ్లం. అప్పడాల కర్ర హోదా వచ్చేవరకూ మరో అప్పడాలకర్ర ఆజ్ఞానుసారం నడుచుకోవాల్సిందే!' అనుకుంది. అనుకుని సరిపెట్టుకుందామనుకుంది.

కాని అప్పుడే మనస్సుజాత మడత పేచీ పెట్టింది—'మన ఖర్మ యింతే అనుకున్న వాళ్లెవ్వరూ పైకి రాలే—బావిలోపడిన బండలా అడుగడుక్కి పొయ్యేరేగాని! కోపగించుకుని యేం చేస్తాం అని ముడుచుక్కూచుంటె—ఓయ్—చేతులేకాదు చేతుల్తో పాటు కాళ్లూ కాల్తై. ఆ తర్వాత ఏడ్చినా లాభం వుండదు. అంతెందుకు...నువ్విప్పుడు యింటి యజమానిముందు అద్దె మనిషిలా పెద్దబ్బాయ్ చెప్పే దానికల్లా బుర్రూపుతూ కూచుంటే నీ కెల్లాటి చీర దొరుకుతుందో తెలుసా...అదుగో......అటు చూడు శ్మశానంలావున్న ఆ బీర్వాలోవున్న పుర్రెల్లా వున్న చీరెల్లో ఓ పుర్రెమార్కు చీర!! నువ్వెల్లాగూ శివుడిభార్య పార్వతివిగావుగనక వాటితో సరిపెట్టుకోలేవు...అంచేతా...అంచేతా...'

సుజాత మనస్సుజాత మాట ల్నమ్మింది— కాని పెద్దబ్బాయ్ ముందు ఉగ్రరూపం ప్రదర్శించదలచుకో లేదు. అలాని ఎర్రంచు తెల్లచీరె వదులుకోదల్చుకో లేదు. అందువల్ల, అట్నుంచి నరుక్కొద్దామను కోవటంవల్ల మెల్లిగా వదిన పక్కకుచేరి పెద్దబ్బాయ్‌కి విన్పించేలా కాస్త పెద్దగా అంది.

'ఏవిటో పాతిక రూపాయలన్న మాటేగాని యీ చీరెలు పట్టుమని పదిరోజులేనా వుండవ్ గదొదినా?'

సుజాత మాటలు చేరవలసినచోటికే చేరినై. చెవుడులేని పెద్దబ్బాయ్ ఆ మాటలు విని గిరుక్కున సుజాతకేసి తిరిగేడు.

'ఎందుకుండవ్ బేబీ! యీ షర్ట్ చూడు కుట్టుకూలీతోసహా పన్నెండ్రూపాయలైంది. కాని సంవత్సరం దాటిపోతోంది. యింకా చెక్కైనా చెదర లేదు!'

'అదికాదన్నయ్యా......'

'అవును బేబీ! ఒక్కొక్కప్పుడు యెంతో డబ్బు పోసి కొన్నవి కొన్నంతసేపుండవ్. యిదుగో యీ అయిదురూపాయల్నోటు చూడు పైసాకంటే ఎంతో విలువైనది. అయినా యిలా అంటే చిరుగుతుంది. అలా అంటే నలుగుతుంది. కాని పైసావో!?... నువ్వు తిట్టు కొట్టు గట్టిగా అల్లాగే పడుంటుంది అవునా?'

సుజాతకి ఒళ్లుమండింది. కాని మంట కన్పించనీలేదు. మాట విన్పించనీలేదు. అవువనక, కాదనక మౌనంగా తలొంచుక్కూచుంది.

అప్పుడే కొట్లో కుర్రాడు ఓ చీరెలదొంతర తెచ్చి వాళ్లముందు పడేసేడు.

సుజాత వాటిన్చూసి వంటవాడి కొడుకున్చూసిన జడ్జిగారబ్బాయిలా ముఖం మాడ్చుకుని కాస్త అసింటా జరిక్కూచుంది.

వదినల్లా జరగలేదు గాని పక్కింటివాళ్ల బియ్యంలో రాళ్లేరుతున్నట్టు ఆ చీరెల్ని కెలకసాగింది.

పెద్దబ్బాయ్‌మాత్రం అనలైన బేరగాడిలా ఒక్కొక్క చీరెని జాగ్రత్తగా పరీక్షగా చూస్తూ—'చూడు బేబీ యిందులో నీకే చీరె నచ్చుతుందో' అన్నాడు.

[ఒరేయ్! ఒరేయ్! నువ్వెల్లాగూ నా యిష్టానికి వురేస్తున్నావ్. ఆ వురి యే తాడుతో బిగి చాలో గూడా నువ్వే నిర్ణయించుకోరా మళ్లా యిందులో నా అభిప్రాయం యెందుకూ!]

పెద్దబ్బాయ్ చేతిలోవున్న చీరెని కిందపడేసి కిందవున్న చీరెని చేతిలోకి తీసుకున్నాడు—

'ఈ డిజైన్ బావున్నట్టుంది బేబీ యీ చీరె తీసుకుంటావేఁవిటీ?'

'నీ యిష్టం!'

'పోనీ యీ చీరె చూడు. డిజైన్ అంత బాగోపోయినా కలర్ బాగుంది. యి తీసుకుంటావా?'

'నీ యిష్టం!!'

'అయితే యీ చీరె చూడు డిజైనూ కలరూ రెండూ బాగున్నాయ్. తీసుకోగూడదూ.'

'నీ యిష్టం!'

'పోనీ అది.'

'నీ యిష్టం?

'అది గాకపోతే...వు...యిదీ...'

'నీ యిష్టం!!.'

పెద్దబ్బాయ్‌కి కోపమొచ్చింది. సర్రున పైకొచ్చింది. పైకొచ్చి, మాటల రూపంలో—'బేబీ! ఏఁవిటా ఒళ్లుపొగరు! ఏదో పుట్టినరోజాగదా మరీ ఏడ్చిపోతావని చీరె కొందాఁవనుకుంటే ఏమిటా తలతిక్క సమాధానాలు! ఇక్కడికి నువ్వు పుట్టింట్లో మహారాణిలా పెరిగి అత్తారింట్లో మహారాణీకింద దాసీదాన్లా పడుండాల్సొచ్చినట్టు పాడుముఖం పెడతావేఁ? అస లీపూట నేను చీరె కొనిపెట్టగలుగుతున్నందుకు సంతోషించు. సంతోషించలేకపోతే నాకు నువేం చీరెలు కొనొద్దు అని ఒళ్ళుఏడ్చుఏడ్చి అవతలికిఫో'—అన్న మాటల రూపంలో అతగాడి నోటిమండి వెలువడబోయింది. కాని అతగాడి నోరు మూతపడి వుండటంతో (అప్పుడు పెద్దబ్బాయ్ నోరెందుకు మూతపడి వుందిటా? వాళ్లున్నది వాళ్లింట్లో కానందుకు వాళ్లమట్టూతా వున్నది వాళ్లవాళ్లు కానందుకు అవును?) ఇంకాస్త పైకిపోయి కళ్లల్లోంచి బైటపడ్డది.

సుజాత తలొంచుక్కూచున్నది గనక అచ్చూళ్లేదు.

కాని వదిన—'యీ చీరలేవీ సుజాకి వచ్చనట్టుంది. కాస్త ఎక్కువ రేట్లలో ఏవైనా తీయమందురూ'—అనబోయిందల్లా పెద్దబ్బాయ్ కళ్లన్చూసి ఆగిపోయింది. ఆవిడకి పొయ్యిలో మంటెక్కువైతే పొయ్యిమీది పాలు పొంగుతాయని తెలుసు. అలాగే పెద్దబ్బాయ్‌కి కోపమెక్కువైతే మాటలెక్కువగా మిగులుతాడనీ తెలుసు. అంచేత, పొయ్యిలో మంట తగ్గించలేని వంటవాడు పొయ్యిమీంచి పాలగిన్నెను దింపవతలపెట్టినట్టు పెద్దబ్బాయ్‌కోపం తగ్గించలేని వదిన కనీసం పెరక్కుండా చూసేందుకు ఆరాటపడింది.

'అ! యిలా చూస్తూ కూచుంటే కొట్లోవున్న చీరెలన్నీ చూడాలనిపిస్తుంది. తీరా చూసేక అదిగాదుయిదీ యిదిగాదు అదీ అనుకోవటం తప్ప కొనటంవంటూ జరుగదు. ఎందుకొచ్చిన కాలయాపన గానీ యిందాక మీరు చూసిన చీరె తీసుకొండి సుజాకి బాగా నప్పుతుందికూడాను'—యిలా అనేసి వూరుకోక

వదిన కొట్లో కుర్రాణ్ణి పిలిచి ఆ చీర తీసిచ్చి 'పాక్' చెయ్యమన్చెప్పింది: చెప్పేక, కుర్రా డాచీర తీసికెళ్లేక 'లే, సుజా మనం బయట నిలబడ్దాం' అంటూ సుజాత న్తీసుకుని బయటకెళ్లింది.

పెద్దబ్బాయ్ అధర్మాన్ని జయించలేని ధర్మంలా అసలు నేరస్థుణ్ణి శిక్షించలేకపోయిన జడ్జీలా తిట్టుకుంటూ (?) లేచి డబ్బిచ్చి పాకెట్ తీసుకుని బయటకొచ్చేడు. ఓ పక్కగా ఒదిగి నుంచున్న సుజాతకా పేకేట్టు అందించాడు.

అన్నం అవసరమైన బిచ్చగాడు పైసా అందుకున్నట్టు అయిష్టంగా పెద్దబ్బాయిచ్చిన పాకెట్టందుకుంది సుజాత.

'యిక వెళ్దామా?'—పెద్దబ్బాయ్ నడక సాగించేడు.

'పదండి'—వదిన కదిలింది.

సుజాతకూడా కదిలింది.

ముగ్గురూ కొంతసేపు, కొంతదూరం నడిచేక వాళ్లకో వూరేగింపు ఎదురొచ్చింది.

సుజాతావాళ్ల న్చూసిన వూరేగింపులో మార్పేమీ రాలేదుగాని వూరేగింపున్చూసిన సుజాతలో మార్పొచ్చేసింది.

ముందు వూరేగింపును దూరంనుండిచూసిన సుజాత 'ఆ సినిమా బావుండేట్టుందే' అనుకుంది.

తర్వాత దగ్గరకొచ్చిన వూరేగింపునూ, వూరేగుతున్న బొమ్మల్ని చూసిన సుజాత—'అబ్బ యీ సినిమా బ్రహ్మాండంగా వుంటుంది' అనుకుంది.

'మరి అంతబ్రహ్మాణ్డంగావుండే సిన్మాని నువ్ చూడవా?'—ఈ ప్రశ్న యెక్కడ్నుండో రాలేదు—సుజాతలోంచి—మనస్సుజాత దగ్గర్నుంచి వచ్చింది.

'ఎందుకు చూణ్ణు బ్రహ్మాండంగా చూస్తాను!'—సుజాత్తాలూకు యీ జవాబు సుజాత కిష్టమైన జాంగ్రీలా లోని కెళ్లింది. కాని మనస్సుజాత ఆ జవాబును లోపల యిమడనీయక తికమకపెట్టి 'ఎలా?' అన్న ప్రశ్నరూపంలో బయటకుపంపి సుజాతను తికమకపెట్టింది!

'ఎలా' అన్నప్రశ్న రాగానే సుజాత ఒక్క ప్రశ్నక్కూడా జవాబురాయలేని పరీక్షార్థి(ని)లా భయపడిపోయింది. ఒక బరువు దించీదించకుండానే మరో బరువెత్తుకోవాల్సొచ్చిన కూలీలా డీలా పడిపోయింది. చివరికి, కలిమిపోయి కష్టాలుకలిసొచ్చే రోజుల్లోపుట్టి కష్టాల్లో పెరుగుతున్న కామాక్షిలా బేలగా—'హవును! ఎలా చూడగల్ను? ఇదేంనన్నా హరికథ అనుకున్నదె తడవుగా తలుపు లాత్తాలేసి వెళ్లి పందిరి గుంజకానుక్కూచుని, విని, పళ్లేలుపట్టే వేళకు పరుగెత్తుకొచ్చేందుకు! యిది సినిమాఆయె! సినిమా అంటే టిక్కెట్టు—టిక్కెట్టంటే డబ్బులు—డబ్బంటే అన్నయ్య—అన్నయ్యంటే కర్కోటకుడు! నెలకు రెండు సినిమాలకంటే ఎక్కువ చూడగూడదని ఆంక్షపెట్టిన యీ కర్కోటకుడు మూడో సినిమా చూణ్ణిస్తాడా'ంటూ 'కర్కోటకుడి'దగ్గర పళ్లు కొరుకుతూ కసిగా పెద్దబ్బాయ్‌కేసి చూసింది.

పెద్దబ్బాయ్ అప్పటివరకు దిక్కులు్చూడకుండా నడుస్తున్నవాడల్లా అప్పుడే సుజాత దిక్కుకు చూసేడు. ఎర్రబడ్డముఖం, యింకా ఎర్రబడిన కళ్లు, యింకా ఎర్రబడని ముక్కూ చూసేడు. అలిగి ముద్దుగా మూలకూచున్న మూడేళ్ల పాపన్చూసినట్టు ముచ్చటపడ్డాడు. స్టేజీమీద ఓపక్క డైలాగులు మర్చిపోయి నానా అవస్థపడుతుంటే మరోపక్క జనం తెగగోలచేస్తుంటే ఏంచేయాలో తోచక ఏడుపు మొహంపెట్టిన నటుణ్ణి చూసినట్టు జాలిపడ్డాడు. అందువల్ల తన కోపాన్ని మరిచిపోయి సుజాత కోపాన్ని తగ్గించబోయి రాజీపడుతున్న ధోరణిలో నవ్వుతూ అడిగేడు—'ఏం బేబీ! ఈ సినీమా బావుంటుందా?' అని.

సుజాతకి పెద్దబ్బాయ్ నవ్వులో 'నువ్వసలా సినిమా చూస్తేగదూ బావుందో లేదో చెప్పేందుకు' అన్న ఎగతాళి, అతగాడి మాటల్లో 'నా దయాదాక్షిణ్యాలుంటేనేగద నువ్వాసినిమా చూడగలిగేది'

అన్న హేళనా కనిపించి కవ్వించేయి. దాంతో సుజాత పల్లెత్తుమాటంది. తన మాటల్లో ననకెప్పుడు వెసులుబాటయ్యే కసురుబాటుని కలిపేసింది—

'ఏమో! నాకెలా తెలుస్తుంది! నే చూస్తేగా ఆ సినిమా'!

కొట్టుకు ఛస్తున్న శత్రుదేశాలమధ్య మిత్రదేశంలా పెద్దబ్బాయ్ సుజాతల నడుమ నడుస్తున్న వదిన సుజాత నిర్లక్ష్యంగాఅన్న మాటలువిని పెద్దబ్బాయ్ మనిషికాకుండా పోతాడేమోనని భయపడిపోయింది. భయపడినంతా జరక్కుండా వుండేందుకు పెద్దబ్బాయ్‌కీ నచ్చేలా నవ్వుతూ—

'పోనీ యీ పూట సినిమా చూసేద్దామేవిటీ? టైంకూడా వున్నట్టుంది' అంది.

'మరి నడవండి!'

అంతవరకు యింటి నడక నడుస్తున్న ముగ్గురు సినిమానడక నడిచి థియేటరు చేరుకున్నారు.

అయితే అప్పటికే థియేటర్ చేరుకున్నవాళ్ళు చాలామంది వున్నారు. వాళ్లు కుళాయిముందు బిందెల్లా, కుండల్లా, బుకింగ్ ఆఫీసులముందు బారులు తీర్చివున్నారు. బారుల్లో లేని కొందరు కొత్త బారులు సృష్టించేందుకు తంటాలుపడుతున్నారు. మరికొందరు పాతబారుల్లోనే యిరుక్కుందుకు ఆరాటపడ్తున్నారు. ఇంకొందరు ఏ బారుల్లోనూ చేరక పెళ్లికొచ్చిన పెద్దల్లా హడావుడిగా తిరుగుతున్నారు.

అనుకోకుండా చూద్దామనొచ్చిన సినిమాకి అనుకోనివచ్చిన అంతజనాన్ని చూసేక పెద్దబ్బాయ్‌కి టిక్కెట్లు దొరకవేమోనన్న అనుమానం బయల్దేరి లిన్నగావెళ్లి 'టికెట్లు దొరకవ్' అన్న నమ్మకం దగ్గర ఆగింది. అనుమానం కలిగి, నమ్మకం కుదిరిన పెద్దబ్బాయ్—'ఇంత రష్‌లో యేం చూస్తాంలే బోడిసినిమా. అసలు టిక్కెట్టు ముక్కకూడా దొరికేట్టులేదు. పోదాం పదండి' అని పెళ్లాన్ని, చెల్లెల్ని యింటి దోవ పట్టిద్దామనుకున్నాడు. కానీ, 'సుజాత యిప్పటికే యేడ్చిపోతూంది. యిప్పుడీ సినిమా చూపిస్తానని తీసుకొచ్చి వుత్త థియేటర్ చూపి పంపిస్తే ఆ ఏడ్పుకిహ అంతుండదు. అంచేత ఒఖసారి ఆ టిక్కెట్లకోసం ప్రయత్నించటం మంచిది. టిక్కెట్లు దొరికితే సుజాత (వాళ్ల వదినకూడా) సంతోషంగా నవ్వుతుంది. ప్రయత్నించేక దొరక్కపోతే నవ్వకపోయినా కనీసం ఏడ్వకుండానైనా వుంటుంది'అని అనుకొన్నవాడై సుజాతనీ వదిన్నీ ఓచోట నిలబెట్టి తనెళ్లి రూపాయి పెహ్ఫై పైసల 'క్యూ'లో నిలబడ్డాడు.

కాస్సేపతడలా నించున్నాక బుకింగ్‌ఆఫీసు తెరిచేరు.

అంతవరకు ఎలక్షన్లలో నిలబడ్డ పెద్దమనుషుల్లా బుద్ధిగానుంచున్న వాళ్లందరూ ఎలక్షన్లలో గెలిచినవారు మంత్రిపదవుల కెగబడ్డట్టూ, విమానంలోంచిపడే అన్నంపొట్లాలకోసం వరదబాధితులు వరదలా విజృంభించినట్టూ బుకింగ్‌ఆఫీసు మీదికి దండెత్తేరు. ఆ దండయాత్రలో పెద్దబ్బాయ్ కనీసం భటుడిగానైనా పనికిరాడని బైటకుతోసేశారు.

పెద్దబ్బాయ్ దేశం పాడైపోయిందని బాధపడిపోయి, ముఖం వేళ్లాడేసుకుని సుజాతవాళ్లదగ్గర కొచ్చేడు—'లాభంలేదు టిక్కెట్లందవ్!' అంటూ.

'పోనీ రెండ్రూపాయల టిక్కెట్లేనా...'—వదిన పెద్దబ్బాయ్‌తో అందామనుకున్న మాటలు సుజాత ఆకాశంతో అంది.

'ఎందుకు దండగ! యీ సినిమా యివ్వాళగాకపోతే రేపు చూడొచ్చు. యిప్పుడే మునిగిపోయిందేంలేదు'- అనబోయిన పెద్దబ్బాయ్ ఆగేడు. పోన్లే... పోతేపోయింది రూపాయిన్నర. యింతదూరం వచ్చేక నీరసపడి తిరిగి పోవటమెందుకూఅన్న ఆలోచనదగ్గర ఆగేడు. ఆగిందగ్గర్నుండి బయల్దేరి 'బుకింగుఆఫీస్'కేసి నడిచేడు.

తార్చబోతున్న కుక్కను 'దాదాదా ఉజ్జా...

చాచాచా యిజ్జా......'అని లోపలికంటా పిలిచి క్రుచ్చుకు ఫెడీల్మని కొట్టినట్టు పెద్దబ్బాయ్‌ని కిటికీదగ్గిరసా రనిచ్చి తలుపులు ధడేల్న మూసేశాడు బుకింగ్ క్లర్క్.

పెద్దబ్బాయ్ చేసేదిచూసేది లేక కోపగించుకుని, అది కనిపించకుండా విసుక్కొని విసుక్కొనించకుండా చిర్నవ్వు నవ్వుతూ సుజాత వాళ్ళదగ్గరకొచ్చి యేదో అనబోయేంతలో సుజాతే అందుకుంది—

'అన్నయ్యా యీ అబ్బాయిదగ్గర రెండ్రూపాయల్కి క్కొట్టు నాలుగు రూపాయల్ట. మూడే టిక్కెట్లున్నెట్ట. తీసుకుందామా?'

పెద్దబ్బాయ్ సుజాతకేసీ చెప్పలేదు. మారువేషంలోవున్న మహారాజులా ఠీవిగా, నిర్లక్ష్యంగా నిలబడ్డ కుర్రాడికేసి తిరిగి—'వద్దులేఫో బాబూ' అన్నాడు.

కుర్రాడు వెళ్లిపోలేదు. టిక్కెట్లంటకట్టే వుద్దేశ్యంతో అన్నాడు –

'పోనీ మీరెం తిస్తారో చెప్పండి!'

'ఏమీ యివ్వం నువ్వెళ్లు!'—పెద్దబ్బాయ్ విసురుగా దురుసుగా అన్నాడు.

'అరె! యెందుకయ్యా అట్లా అరుస్తావ్. జేబులో డబ్బుల్లేవనిచెప్తే మాట్లాడకుండా పోతాంగా' అంటూ నవ్వుకుంటూ వెళ్లిపోయేడు కుర్రాడు.

సుజాత మయసభకొచ్చిన దుర్యోధనుడిలా కాస్సేపు వుడికి పోయింది. తర్వాత నరసింహస్వామిలా వున్న పెద్దబ్బాయ్‌ని చూసి భయపడి పోయింది—ఏం గొడవ చేస్తాడోనని.

పెద్దబ్బాయ్ సుజాతని భయపెట్టేమాట లేవి అన్లేదు. గొడవేమీ చెయ్యలేదు. యాంత్రికంగా 'పదండి' అన్నాడు.

తండ్రి తంతాడేవోనని భయపడి బిక్క మొహాలేసుకుని బడికి బయల్దేరే పిల్లల్లా సుజాత, వదినా నడక సాగించేరు— పెద్దబ్బాయ్ ననుసరించేరు.

ముగ్గురూ పీనుగన్మోసొస్తున్న వాళ్లలా ముఖాలు యింత చేసుకుని పెద్దబజారు కొచ్చేసరికి పెద్దబ్బాయ్‌ని ఓ 'హలో' పలకరించింది (అప్పుడగలేదు). పెద్దబ్బాయ్ 'హలో'తో కాసేపు అప్యాయంగా మాటాడి, హలో పక్కనున్న వాడితో చేయికలిపి, తర్వాత రెండు చేతులూ కలిపి సెలవడిగేడు. హలోద్వయం సెలవిచ్చి వెళ్లిపోయేక పెద్దబ్బాయ్ ముందుకు నడవక వెనకొస్తున్న సుజాతా, వదినలకోసం ఆగేడు.

సుజాత వదినలొచ్చి కల్సుకున్నాక వాళ్లతో పాటు నడుస్తూ వదినొస్తో అన్నాడు పెద్దబ్బాయ్—

'నీకు అతను తెల్సుగదోయ్ కృష్ణమూర్తినీ...'

'ఆ. ఆ. తెలుసు తెలుసు'

'అతని పక్కనుంది వాళ్ల తమ్ముడే! ఎం. ఎ. చదువుతున్నాడు. ఆస్తిపాస్తులు లేకపోయినా అందం గుణం వున్నవాడు. మన బేబీకి అతడికి ఈడూ జోడూ బాగా సరిపోతుంది కదూ!'

సుజాత ఎడం చెంపమీద ఛెళ్లున చరిచినట్టు తలను తక్కున కుడివేపుకు, పెద్దబ్బాయ్ వేపుకు తిప్పింది.

(అమ్మ పెట్టాపెట్టదు. అడుక్కు తినానీయదు' అన్నట్టుందిరా నీ వాలకం... పెద్దబ్బాయ్... నువ్వెలాగూ నా కోరికలకి సమాధులు కడ్తున్నావ్. అయినా నేను ఆడపిల్లనుకదా. అత్తవారింటికెళ్లాల్సిందాన్నికదా, ఆ వెళ్లేదేదో కాస్త వున్న వారింటికెళ్తే. వున్నవాడైన నా భర్త సమాధి కాబోతున్న నా కోరికలను బయటకులాగి షామియానాల క్రింద తీరుస్తాడన్న ఆశతో బ్రతుకుతున్నాను. కానోరేయ్, నువ్వా ఆశకూ్కడా ఎసరు పెడ్తున్నావ్! చేతకానివాడిచేత ముళ్లు వేయించాలని చూస్తున్నావ్. అప్రనా! బుద్ధిమంతుడైనా, బృహస్పతైనా ఆస్తిపాస్తుల్లేనివాడికి మిగిలేవి పస్తులేరా. నువ్వేదో వాడి ఎం. ఎ. చూసి మురిసిపోతున్నట్టున్నావ్. యీ ఎం. ఏలన్నీ ఉద్యోగాల్దగ్గర

కొచ్చేసరికి మ్మెమ్మెమ్మెమ్మెలేరా! ఓవేళ యేదైనా గుమాస్తా ఉద్యోగం సంపాయించగలిగినా, గుమాస్తా గాడి సంపాదనతో సుఖపడటమనేది కల్లంరోరేయ్...]

'అయితే కట్నం యేమాత్రం అడుగుతున్నారేవిటీ?'—వదిన ప్రశ్న.

'కానీకూడా అడగటంలేదు. కాకపోతే మనం పెళ్లిఖర్చులు భరించాల్సుంటుంది అంతే'!—పేదవాడింటికి భోజనానికొచ్చేందుకొప్పుకున్న పెద్దమంత్రి గారి పెద్దహృదయంగురించి చెప్పేనట్టు చెప్పేడు పెద్దబ్బాయ్.

[సెహబాష్! మంచిసంబంధమే వెతికేవురా పెద్దబ్బాయ్! అయినా యీ సంబంధం కుదిర్తే నువ్ కనీసం పెళ్లిఖర్చైనా భరించాల్సుంటుంది. కాని... అటు చూడు. గుడ్డరంగేవిటోకూడా తెలీనట్టు మాసిపోయిన బట్టలతో, మాంసాన్నంతా తినేసి లోకాన్ని చూడాలని తాపత్రయపడుతున్న ఎముకల్తో, వుంటే పచ్చగా, లేకుంటే ఎర్రగా రాగిగా కన్పిస్తున్న జుత్తుతో, నానారకాలైన కుళ్లుతోనిండి పొంగి పొర్లుతున్న చెత్తకుండీలా వున్నాడే గుడ్డిబిచ్చగాడు... అతడిదగ్గరకువెళ్లి 'నా చెల్లెల్ని చేసుకో'మ్మని అడగరా. అతగాడికి తోడు కావాల్సివుంటుంది—వెంటనే ఒప్పేసుకుంటాడు. నీ కిహ పెళ్లిఖర్చుకూడా వుండదు. అతకాడు అడుక్కుందీ, తినకుండా దాచుకుంది పెళ్లిఖర్చు కిచ్చేస్తాడు. ఆ తర్వాత ఎల్లాగూ మేవిద్దరం నీదగ్గరా, నీలాటివాళ్లదగ్గరా ముష్టెత్తుకుంటాంలేవనుకో!]

'ఆహా! అయితే సుజా త్వరలో పెళ్లికూతురు కాబోతోందన్నమాట! ఏం పిల్లా పిల్లాడ్నిచూసేవా?—' సుజాతని మోచేత్తో పొడుస్తూ అంది వదిన.

సుజాత వదిన్తో మాటాడలేదు—మనస్సుజాత వడిగింది—

'యిప్పు డెలా! జరగకూడందేదో జరిగేట్టువుంది. యీ అన్నిగాడు అన్నంత పనీ చేసేట్టున్నాడు. మనసా— యిహ దారేదో నీకు తెలుసా...మనసా... తెలుసా...'

'అదిగో అదే దారి!'—మనస్సుజాత చూపింది.

సుజాత చూసింది.

అక్కడ—అక్కడ బంగారు వాన పడుతోంది. అందులో సుజాత వుంది. సుజాత అదేదో వారపత్రిక ముఖచిత్రంలానో, ఆకర్షణీయమైన క్రోటను పత్రంలానో అందంగా తయారై కాలేజీకి వెళ్తోంది. దార్లో నరకలోకానికి, స్వర్గలోకానికి మధ్య వంతెనలా వున్న పెడవాటి కాలొహాడి వుంది. దాన్నానుకుని సన్ననివాడైనా వెయ్యేనుగులబలంకలవాడు (ఏనుగు చచ్చినా వెయ్యే బ్రతికినా వెయ్యే అని వాళ్లమ్మా నాన్నా అంటూండగా చాలసార్లు వింది సుజాత) పుణ్యాత్ముల్ని స్వర్గానికాహ్వానించే దేవేంద్రుడిలా నిలబడి వున్నాడు. అచ్చు సుజాత అభిమాన నటుడిలా వున్నాడు. అతగాడు గులాబీల్ని చూడగనే పరవశించి పోయినట్టు సుజాతను చూడగనే 'ఏక్ దమ్మున' ప్రేమించేసేడు (మీరు చూళ్లేదా? సుజాతకూడా ప్రేమించేసింది!)

అల్లా సుజాతమ ప్రేమించినతడికి ఓ తోట బంగాళావుంది. బంగాళాలో వూరిన బంగాళదుంపల్లాంటి అమ్మా నాన్నా వున్నారు. హీరో వాళ్లదగ్గరికెళ్లి—'డాడీ, మమ్మీ నేను సుజాతను లవ్ చేసేను. ఐ వాంట్ టు మారీ హర్' అన్చెప్పేడు. దానికి వాళ్లు సుతరామూ ఒప్పుకోలేదు. హీరో సుజాతల పెళ్లికి అడ్డగోడగా నిలిచి తప్పుకోనూలేదు! దాంతో హీరో ఆగ్రహించి 'యీ సిరి సంపదల్తో మీరే వూరేగండి. నేను నా సుజాత్తో వూరేగి ఏ వూరి కొంపలోనైనా పడుంటాను.' అని బంగాళాలోంచి బయటపడపోయేడు. కాని అతగాడి అమ్మా నాన్నా అతణ్ణి గట్టిగా పట్టుకుని, కళ్లనీళ్లు పెట్టుకుని 'ఒరె నాయనా నీకోసం యీ ఆస్తిపాస్తులనుకున్నాంగాని ఆస్తిపాస్తులకోసం నువ్వనుకున్నావా? నువ్‌లేందే మేంమాత్రం ఎలా బ్రతగ్గలంరా...కానీయ్. నీ యిష్టమే మా యిష్టం. మేం యీ పెళ్లికి ఒప్పుకుంటున్నాం' అనేసేరు!!

(వాళ్లలా పెళ్లికి ఒప్పుకు తీరాలంతే! లేకపోతే... సుజాతకు నచ్చే మొగుడు రావొచ్చుగాని ఆవమ్మాయికి నచ్చే బంగాళా, బంగాళాముందుతోట, తోటముందు కారు, కారులో షికారూ...ఇవన్నీ దక్కునా? దక్క వండీ బాబూ దక్కవ్!!)

ఇహనేవుంది. హీరోతో సుజాత పెళ్లి కాలేజీ ఎన్నికలంత హడావుడిగా జరిగిపోయింది. ఆ తర్వాత ఆ యిద్దరూ సీతారాముల్లా వనవిహారాలూ, పార్వతీ పరమేశ్వరుల్లా గగనవిహారాలు చేస్తూ అమెరికా వెళ్లేందుకు......

'ఏయ్ సుజా! ఏమిటా పరాకు? ఇల్లొచ్చేసింది!'

సుజాత వులికిపడింది. తింటూన్న జీడిపప్పు వుస్మాలో అల్లంముక్క వచ్చినట్టు చిరాకుపడింది. ఓ వెలుగు వెలిగి ఆరిపోయిన జమీందారు ముఖంపెట్టి ఇంట్లోకి వెళ్లింది. చేతిలోని పాకెట్టును టేబుల్ మీదకు విసిరేసి తనగిదిలోకి వెళ్లబోయింది.

'బేబీ! ఇలారా!'

బేబీ వచ్చింది.

'కూర్చో.'

కూర్చుంది.

'బేబీ! యిన్నాళ్లసంగతేవోగాని యివాళ నీ కోర్కెలు—అన్నింటినీ కాకపోయినా కొన్నింటినైనా తెల్సుకోదలిచేను. కాని చూడు తల్లీ! నీ ఒక్కో కోరికా, నీ సినిమా భాషలో చెప్పాలంటే, సెవెన్టి ఎం. ఎం. స్క్రీనంత (అంటే తెలుగు తెరకు రెండింతలు తెలుగు తారలలో సగవూను) పెద్దది. అయితే వాట్ని తీర్చుకుందుకు నీకు, తీర్చేందుకు నాకూ వున్న అవకాశాలు నువ్ చిన్నతనంలో పేరంటానికెళ్తూ శనగలు తెచ్చుకుందుకు తీసికెళ్లేదానికే కర్చీపులు...వాటికంటే బహు కొద్దివి. యిహపోతే నీ కోరికల తెరలు సినిమా తెరల్లా పొడవులోనూ వెడల్పులోనూ పెరిగిపోతుండొచ్చు. ఎటొచ్చీ అవకాశపుతెరలే ఎప్పుడూ అల్లా కర్చీపుల్లా, ఎదుగు బొదుగు లేకుండా అల్లానే పడుంటాయ్! అంచేత తల్లీ. అవకాశాల్నిబట్టి కోరికల్ని మలచుకోవటం నీకూ మంచిది నాకూ మంచిది! యిహ వెళ్లు!!'

సుజాత వెళ్లింది. తన గదిలోకి వెళ్లింది.

వెళ్లి ఏడ్చింది!

తలుపులు గడియపెట్టుకుని మంచంమీద బోర్లా పడి భోరున ఏడ్చింది. ఏడుస్తూనే దేవుణ్ణి పిలిచింది. అత డొస్తాడో లేదో చూసుకోకుండానే అతగాణ్ణి దులిపేసింది.

'ఒరేయ్ దేవుడూ! చూసేందుకు కళ్లిచ్చేవ్. కోరుకుందుకు మనసిచ్చేవ్! అనుభవించమని మనిషిని పుట్టించేవ్! అయితే ఆ పుట్టించటం ఏ ఆరంతస్తుల భవనంలోనో నేనంటే పడిచచ్చేవాళ్ల మధ్య పుట్టించుంటే బావుండేది. కాని నువ్వలా చెయ్యలేదురోరేయ్! నన్నీసికెళ్లి పూరికొంపల్నిచూసి నేనే గొప్ప అని పొంగిపోతూ, పెద్ద మేడల్నిచూసి "హెచ్చే నేనేం గొప్పా, అని కుంగిపోతూవుండే పెంకుటింట్లో పడేసేవ్. ఆ యింటోనే నాకో అన్నిగాణ్ణి సృష్టించేవ్! దాంతో నా పరిస్థితి యెలా తయారైందో తెలుసురా నీకు. విన్నావ్‌రేయ్!.. యూదేందుకు నీళ్లున్నై. నీళ్లనిండా మొసళ్లున్నై. మెరికల్లాంటి కోరికలున్నై. వాట్ని తీర్చుకుందుక్కావలసిన డబ్బు అన్నిగాడి దగ్గరుంది! వాడిసంగతి నీకు తెలీందేవుందిరా దేవుడూ! పైసా దొరికితే దానికి తోడుగా మరో తొంభైతొమ్మిది పైసలు పోగుచేసి రూపాయి చేద్దామని తాపత్రయపడే మనిషికాదురా వాడు. అల్లాంటివాడు కాబట్టే నన్నూ, నాయిష్టాల్ని నిర్లక్ష్యం చేస్తున్నాడు. పైగా యివాళ నా కోరికల్ని కొండంతల్చేసి బుద్ధులు చెప్పేడ్రా దేవుడూ. కాని ఒరేయ్ ..ఒక్కమాటు...వాన్లో తిరిగేవాడు గొడుగు కావాలనుకోవటం, చిల్లుల గొడుగున్నవాడు మంచి గొడుగు కావాలనుకోవటం తప్పంట్రా? పుట్టింటి దగ్గర్నుంచి అడవిలో సీతలా నారబట్టలు కట్టుకుంటూన్న దాన్ని యిప్పుడు కాస్త మంచి చీరె కావాలనుకోవటం

నేరమ్మ(టా ? చెప్పవేరా? చెప్పూ... చెప్పూ... చెప్పూ!!!'

సుజాత మళ్లీ వలవల ఏడ్చేసింది. ఏడ్చి ఏడ్చి యిహ నా వన్పెయ్య లేక ఆపేసింది. ఆపేక ఆక లేసింది. అన్నం తినదలచుకోక రెండు గ్లాసుల నీళ్లు (తాగేసింది. తాగేక కడుపు చల్లబడింది.

రా(త్రివేళ కూచుని పగటిపూట పగవాడిలా వేధించిన ఎండ తీ(వత గురించి మాటాడుకున్నట్టు కాస్త చల్లబడిన సుజాత (పొద్దుట్నుండి అప్పటి వరకు కడుపు మండివందుకుగల కారణాలను నెమరు వేసింది.

అంతా అయేక, 'పోనీ మన కోరికల విలువ కొంత తగ్గించుకుంటే యీ అన్నిగాడు నిజంగానే తీర్చేస్తాడేమో'నన్న అనుమానం వచ్చింది.

అనుమానం వచ్చేక 'పోనీ అదీచూస్తే పోలా' అన్న ఆలోచనొచ్చింది.

ఆలోచనొచ్చిన వెంఠనే సుజాత, 'పోనీలే ప్లిమత్‌కారొద్దు ఫియట్‌కారు చాలు! నూటపాతిక రూపాయల్చీరొద్దు మూడుపాతికల్చీరె చాలు. నా మొగుడు కోటీశ్వరుడే కానవసరం లేదు. లక్షాధి కారి అయితే చాలు. అదీగాకపోతే యే బాదరబందీలేని వెయ్యిరూపాయల జీతగాడైనా ఫరవాలేదు' అనుకుంది.

అనుకున్నాక, అనుకున్నది అనుకున్నట్టు జరుగుతుందేమోనని అనుకోనన్నాళ్లు ఆశగా ఎదురు చూసింది. చూసి చూసి యీ తగ్గింపు ధరల కోర్కెలు తీరటంకూడా మనదేశం ఆహార విషయంలో స్వయంసమృద్ధి సాధించినంత నిజం అని తెలుసు కుంది.

నిజానికి యీ నిజం సుజాత గుండెల్ని కలుక్కుమనిపిస్తూంటుంది—ఎప్పుడూ కాదు. అప్పు డప్పుడు— పెద్దపెద్ద బట్టలకొట్లూ, కొట్లముందు షో కేసులూ, షో కేసుల్లో ట్యూబులైట్లకింద నిగ నిగలాడే చీరల్చూసినప్పుడూ, తనీడు పిల్లలు (మగ పిల్లలుకాదు) బంగారంలాంటి చీరెల్లో, బంగారపు మెడల్తో బంగారబ్బొమ్మల్లా కారుల్లో కనిపించి నప్పుడూ!

ఇవాళ్టి కివేళ...కాలేజీనుం డింటి కొచ్చేలోపల అప్పటికప్పుడే అయిదుసార్లు కలుక్కుమంది సుజాత నిండుగుండె. యింటికొచ్చి కాసిన్ని కాఫీతాగి పది పైసల లై(బరీలో అద్దెకు తెచ్చుకున్న సినిమా ప(త్రికలో సినీతార పెళ్లిఫోటో (నిజ్జం పెళ్లిఫోటో), ఫోటోలోని సినీతార అలంకారం చూసేక ఆరోసారి కలుక్కుమంది సుజాత తాలూకు పలుచని గుండె. ఎంతైనా పిడికెడు గుండె యిన్ని సార్లు కలతపడటంతో సుజాతకి భరించరాని (భయం కాదు) బాధేసింది. దాంతో తన్ని తను తిట్టు కుంది. తనని కన్నవాళ్లనీ, పోషిస్తున్నవాళ్లని శోషొచ్చేలా తిట్టిపోసింది. యిహ తిట్టవలసినవాళ్లు కన్పించక—'యీ దేశంలో కొందరికే అన్నికోరికలూ తీర నేలా; కొందరు ఒందరు లడ్డూల పాకంలా కుత కుతలాడి పోనేలా' అని కసిదీరా ఏడ్చేద్దామనుకుంది.

సరిగ్గా అప్పుడే వచ్చింది, సుందరి 'సుజా సుజా' అనుకుంటూ.

సుందరి సుజాతవాళ్ల పొరుగింట్లో వుంటున్న గుమాస్తా యొక్క తం కూతురు. మనిషి పొడవైతే పెరగ్గలిగింది గాని లావుకాలేకపోయింది. బలమైన తిండిలేక యెప్పుడూ నీరసంగా ఆర్టీసీ బస్సులాగు వూగులాడుతూంటుంది. ఆ పిల్ల వంటిరంగుకు కను ముక్కుతీరుకు యెంత విలువైన చీరైనా యిట్టే నప్పుతుందిగానీ అమ్మాయి మాత్రం యెప్పుడూ (యిప్పుడు కూడా) గవర్నమెంటువారు పొదుపూ పొదుపూ అంటూ వాడే చిత్తుకాగితాల కవర్లలాటి చీటీగుడ్డలు కట్టుకు తిరుగుతుంది.

అసలు సుజాతకీ సుందరికీ పెద్దబ్బాయ్‌గారి బండిగుర్రానికి పేద రావాయ్ బండిగుర్రానికి వున్న తేడా వుంది.

అయినా సుందరి ఎప్పుడూ ఆనందంగా నవ్వుతూంటుంది.

అయితే యీ ఆనందం, సుందరానందం, సుందరి యింట్లో పండేదికాదు. అలా అని గుమాస్తా యంత్రం అనుకున్నదానికంటే ఎక్కువ అప్పు సంపాదించగలిగిన రోజున రూపాయిచ్చి సుందర్ని సినిమాకి వెళ్ళమన్నప్పుడుగాని, అదే గుమాస్తాయంత్రం పెళ్ళాం పోరగా పోరగా సంవత్సరానికో రెండు సంవత్సరాలకో పాత యినుము కొనేవాడిలా గుడ్డల కొట్లన్నీ తిరిగి తిరిగి చివరికి ఖర్చవక మిగిలిన గుడ్డల తానోటి చౌగ్గా పట్టుకొచ్చి (అప్పుకేస్మీ) యింట్లోవాళ్ళందర్తోపాటు సుందరిక్కూడా ఓ ముప్పిపాళ్ళ యూనిఫారం దానం చేసినప్పుడుగానీ, లేకపోతే యింట్లో పచ్చడితోపాటు పనసపొట్టుకూర చేసుకున్నప్పుడుగానీ కలిగేది కాదు ఆ ఆనందం !

మరెప్పుడు కలిగేది ??

అదే...సుందరి కాలేజీకి వెళ్ళినప్పుడూ, అక్కడ ఆముదం దీపాల్లాకాక ఆకాశ దీపాల్లా వెలిగిపోతున్న అమ్మాయిల్నిచూసి పలకరించినప్పుడు, వాళ్ళ చీరెల్నీ నగల్నీ సున్నితంగా పట్టుకుని కంచిలో బంగరు బల్లిని తాకినట్టూ, పూజారి చూడకుండా దేవుణ్ణి ముట్టుకున్నట్టూ మురిసిపోతూ, వాళ్ళు వాటిని ఎప్పుడు ఎక్కడ ఎందుకు ఎలా కొన్నారో అడిగి తెలుసుకున్నప్పుడూ, తీరికవేళల్లో (అబ్బ సుందరికి ఎంత తీరికనీ!) వాళ్ళ యిళ్ళకువెళ్ళి తన యింట్లో లేనివాటిని వాళ్ళ యిళ్ళల్లో దగ్గరగా చూసినప్పుడూ పండుతుంది, ఆ ఆనంద !!

అయితే పండిన ఆనందాన్ని పదిమందికి పంచక పోతే అదికాస్తా ఎండిపోతుందన్న నమ్మకంవొకటుంది సుందరికి. అంచేత తను ఓ యింట్లో చూచింది మరో యింట్లోనూ, ఒహరి దగ్గర విన్నది మరొహరి దగ్గరా చెప్పి సంతోషిస్తుందా పిల్ల!

'రా సుందరీ! రా...రా...కూర్చో!'—సుజాత సర్దుకుని సుందరికి కుర్చీ చూపించింది.

సుందరొచ్చి 'హమ్మయ్య' అంటూ కూచుంది.

'ఏమిటివేళ కాలేజీ ఎగ్గొట్టేవ్?'—సుజాత అడిగింది.

'ఎగ్గొట్టక ఛస్తానా మన పార్వతి బర్త్‌డే అయితేను! అన్నట్టు మరిచేపోయా...యింటికి నువ్ రాలేదేమిటే?

'ఆ యేదో బద్ధకించేను! బాగా జరిగిందా?'

'బాగా జరిగేందుకు బజారంతా పండుగ చేస్తేరా ఏమిటీ! ఏదో నేనూ నా బోటివాళ్ళు మరో ముగ్గురూ వచ్చేరు అంతే! కాని సుజా యివాళ పార్వతి వో చీరె కట్టుకుంది...అబ్బ కళ్ళు తిరిగేలా వుందంటే నమ్మ!'

'ఆవిడకి కొనిపెట్టేనామ్మన్నాడు. యిహ కళ్ళు తిరిగే చీరలేంఖర్మ ఏకంగా వళ్ళు తిరిగే చీరలే కట్టుకోగలదు!'

'సడేలే! వాళ్ళ నాన్న కొన్న చీరె.. వాళ్ళ నాన్నలానే వుంది!'

'మరి?'

'మరీ...'—సుందరి నాలుగ్గోడలూ చూసింది చెవులుగానీ మొలిచాయేమోనని!

'ఎవరూ లేర్లే చెప్పు!'

'ఆ చీరె వరదరాజులు...మన క్లాస్‌మేట్ వరదరాజులు తెచ్చేడు!'

'నిజంవా?'

'న్యూస్ పేపర్లోనైనా తప్పులూ సవరణలూ కన్పిస్తాయ్‌గాని మన దగ్గరల్లాంటివి మచ్చుకైనా దొరకవ్. కావాలంటె వెళ్ళిచూడు...అడుగు'

'వరదరాజులు పార్వతికి చీరె తెచ్చాడంటె, అతడికీ పార్వ...

'ఆ...ఆ...అప్పుడే కథ అల్లవాకు అసలు జరిగిందేమిటంటే నిన్న 'లంచ్ ఇంటర్వెల్'లో నేనూ పార్వతీ మామూలుగా చెట్టుకింద నిలబడ్డాం. పార్వతి సంగతి నీకు తెలిసిందేగా—వీలుచిక్కితే చాలు తనకు నైలెక్స్ చీరె అంటె ఎంత యిష్టమో, అది కొనుక్కోలేక యెంత కష్టపడుతుందో ఏకరువుపెడ్తుంటుంది. నిన్నగూడా చెట్టుకింద అలాగే ఏకరువు పెడ్తూ

పెడూ ఏడుపు మొహం పెట్టేసి - 'లాభంలేదు! నాన్న నాకు ఈ జన్మలో నైలెక్స్‌చీరె కొనిపెట్టడు. కొనిపెట్టడు.' అని యెంతో దిగులుపడి మళ్లీ అంతలోనే కళ్లింతచేసుకుని 'అవునుగాని సుందీ! రేపు నా పుట్టినరోజున నా కెవరేనా నైలెక్స్‌చీరె ప్రజంట్‌చేస్తే ఎంత బావుంటుందో కదూ !!' అంది.

'చేసేవాళ్లుంటే బాగానేవుంటుంది' అన్నాన్నేను.

దానికి పార్వతి మా పక్కగావెళ్తున్న వరదరాజుల్ని చూసి 'అవును కాలేజీలో యింతోటి పెద్ద మనుషులున్నారు కాని ఏం లాభం' అంది.

వరదరాజులు ఆ మాటలు విన్నాడు. నవ్వుతూ మాదగ్గరకొచ్చి 'ఏవిటి లాభనష్టాల బేరీజు వేస్తున్నారు' అన్నాడు.

పార్వతికి ఏంచెప్పాలో తోచక 'యేంలేదండీ రేపు నా బర్త్‌డే' అంది.

'అచ్చా! అయితే మీ పుట్టినరోజు పండక్కి నన్ను పిలుస్తారా?'—వరదరాజులు అడిగేడు.

'పిలిస్తే వస్తారా వస్తే తెస్తారా!'- కొంటెగా అంది పార్వతి.

'మీరు పిలిస్తే వస్తాను' మీరు ఏది కోరితే అది తెస్తాను!'—మహదానందపడిపోతూ అన్నాడు వరదరాజులు.

'అయితే రేపు ఉదయం పదిగంటలకల్లా పచ్చేయండి నైలెక్స్‌చీరె...'

అంతే! వరదరాజులు మారుపలక్కుండా వెళ్లిపోయేడు. మరుసటిరోజు అంటే యివ్వాళ...చెప్పిన టైంకి పరీక్షకి వచ్చేవాడిలా చక్కావచ్చాడు మానవుడు! వస్తూ నైలెక్స్‌చీరె తెచ్చేడు అమాయకుడు!!'

సుజాత కెందుకో అంతోటి వరదరాజులూ వరదతీసినవాగులా మెత్తబడి మెత్తటిచీరె ప్రజంట్ చెయ్యటానికిగల కారణం పార్వతి తాలూకు అమోఘమైన తెలివే ననిపించింది!

'ఆడవాళ్ల మనసులు వెన్నలూ అమాత్రం యీమాత్రం వేడికే యిట్టే కరిగిపోతాయంటారు గాని యీ మగనన్నాసులే మరీ అన్యాయం. వేడిమాటటుంచి వెన్న చూస్తేనే కరిగిపోతారు! లేకపోతే అది రమ్మని పిలవగనే అతడు రావటమేమిటి అంత ఖరీదైనచీరె తేవటమేవిటీ చెప్పు!'

సుజాత కెందుకో ఆ క్షణంలో 'మగనన్నాసులందరూ వరదరాజులే!' అనిపించేరు.

'మరి నే వస్తా సుజా! మళ్లీ లక్ష్మివాళ్లింటికూడా వెళ్లాలి!'

'లక్ష్మివాళ్లింటికా ఎందుకూ?'

'వూరికే సరదాకి. నువ్వూ రాకూడదూ యిప్పుడే వచ్చేద్దాం'

సుజాత కాస్త ఆలోచించి అంది—'అల్లాగే కూచునుండు వస్తాను!'

'త్వరగా కానీయ్!'

'కానివ్వక! మనకేవన్నా బీరువులకొద్దీ బంగారవూ, బీరువాల కొద్దీ చీరెలూ వున్నాయా అదికాదు యిదీ యిదికాదు అదీ అని ఆలస్యం చేసేందుకు. యిప్పుడే అయిదు నిముషాల్లో వచ్చెయ్యనూ!'

* * *

సుభద్ర వయసులో చిన్నదైనప్పటికీ వయసు మళ్లిన వాళ్లపెద్దమ్మలాగు యెప్పుడూ 'సొంత యిల్లంటూ వోటుంటే తిన్నా తినకపోయినా అడిగేవాడుండడు' అనుకుంటుంటుంది. స్వంతయిల్లు వుండీ తినటానికి లేకపోతే యెల్లా వుండేదో చెప్పలేంగానీ తినటానికి వుండి స్వంతయిల్లు లేకపోయేసరికి ఆవిడ చుట్టుపక్కల జనమంతా తనచుట్టూ చేరి 'నువ్ తినటంలేదు నువ్ తినటంలేదు' అని అల్లరిపెడుతున్నట్టు బాధపడి పోతూంటుంది. అందులో ఈవేళ 'యింటాడు' డబ్బవసరం డబ్బవసరం అంటూ యింటద్దెకొరకు యింటిచుట్టూ మూడు సార్లు తిరిగెళ్లాడో యేమో సుభద్ర తనకున్న యింటిబాధని మూడుపెట్టి మూడు సార్లు హెచ్చవేసి మరీ బాధ పడిపోసాగింది. అలా బాధపడుతూవే

పొయ్యిమీద పప్పుపడేసి పప్పుడకలేదని కొట్టువాడ్ని తిట్టి, కూరలు తరుగుతూ గొంతు కోసుకుందుకు కూడా పనికిరాదని కత్తిపీటను కసురుక్కుని 'బూజు బురుజులు కట్టిన కొంపన్మ్యాసుకుని యెంత మిడిసి పాటు వెధవకి' అని యింటాడ్ని తిట్టి, 'అసలు మాదేలే తప్పు!...పూరిద్దైనా సొంత కొంపంటూ ఒకటి ఏర్పరుచుకోక అద్దెకొంపల కెగబాకటం మాదే తప్పు' అని సినిమా చివర్లోని దుర్మార్గుడిలా పశ్చాత్తాప పడిపోయి విరాగ్గావెళ్లి పత్రిక తీసుకుని మళ్లీ యింటిఆలోచన రాగా పరాగ్గా వుండి పోయింది.

అప్పుడే ఆ యింటి తలుపు మోగింది.

మనుషులేనప్పుడు వంటింట్లో జొరబడే దొంగకుక్క కోసం కాచుక్కూచుని అది రాగానే కర్రుచ్చుకు బయల్దేరే యిల్లాల్లా చేతిలోని పుస్తకాన్ని విసి రవతల పారేసి 'మళ్లీ వచ్చినట్టున్నాడు రాక్షసుడు' అనుకుంటూ వెళ్లి తలుపు తీసింది, సుభద్ర.

తలుపవతల యింటాడు లేడు! యింటి పక్కనుండే బాయమ్మ (రాంబాయమ్మో లక్ష్మం బాయమ్మో సరిగా తెలీదు) వుంది. పళ్లు కన్పించేలా నవ్వుతూవుంది.

కాలేజీఫీజు కట్టటం యెల్లారా భగవంతుడా అని మథనపడిపోతున్న బీద విద్యార్థికి ఫీజక్కర్లేదని తెల్సినట్టు 'యింటాడు వచ్చుంటాడు తగాదాకి దిగాలి కాబోలు' అనుకుంటూ తలుపుతీసిన సుభద్రకి బాయమ్మ కన్పించేసరికి పెద్దబరువు దిగినట్టు ఫీలయింది. తేలిగ్గా నవ్వేస్తూ 'రండి పిన్నిగారూ లోపలికి రండి' అంటూ బాయమ్మని ఆహ్వానించింది.

బాయమ్మ లోపలికొస్తూ 'అయితే తలుపు తట్టిందెవరనుకున్నావ్?' అనడిగింది.

'ఇంకెవరున్నారూ ఈ యిల్లుగల రాక్షసుడు. సరిగ్గా ఫస్టుతారీఖున డబ్భైరూపాయ లీ్తసికెళ్లి వాడిచేతుల్లో పోస్తున్నావా! అయినా తృప్తిలేదు వాడికి. ఇరవై అయిదో తారీఖునుంచీ 'అద్దె అద్దె' అంటూ వేపుకు తింటు టాడు!'

'మరింకా నయంకదూ! యిల్లు ముచ్చటగా వుంది. ఆ యింటాడుకూడా అద్దె అద్దె అంటూ వెంటబడ్తాడే తప్ప అప్పటికప్పుడు కక్కమని పీకలమీద కూచోడు. మా పరిస్థితి మరీ అధ్వాన్నమే! మా యిల్లేమో మా పెద్దత్తగారిలా యివాళో రేపో అంటుంటుంది. అసలా తలుపుల్యూశాపుగా... ముట్టుకుంటేచాలు. అర్ధరాత్రి వరకూ పూరంతా తిరిగొచ్చిన మనవడికి అన్నం పెట్టేందుకు లేచే బామ్మలా మూలుగుతుంటై. అంతోటింటికి పాతికరూపాయలు. అదీ ఫస్టుకిగాదు ఆయింటాడు యేరోజొస్తే ఆరోజు... యేవేళ నిమ్మంటె ఆవేళ తల తాకట్టు పెట్టైనా సరే తెచ్చివ్వాల్సిందేగా!'

'అద్సరేగాని పిన్నీ. నిన్నసాయంత్రం ఎక్కడి కెళ్లేరూ? అన్నిసార్లు పిలిచినా పలకలేదూ!'

'నిన్న సాయంత్రమేవో రాఘవయ్యగారి పెద్దమ్మాయిన్నూసేందు కెవరో వస్తున్నారంటే వెళ్లొచ్చేను. యిప్పుడేమో రాధమ్మగారు యిల్లు కట్టుకుంటున్నారూ, శంకుస్థాపన యివేళేఅంటే వెళ్లి చూసొస్తున్నా.'

'రాధమ్మగారు యిల్లు కడ్తున్నారా!!??'

'యిల్లేవిటే తల్లీ వాళ్లు కోటలైనా కట్టగ్రలు!'

'ఏవిటి మాటలోతైనా?'

'కాదు డబ్బులోతే!'

'అదేవిటి పిన్నీ వాళ్లాయన చేసేది కంపౌండ రుద్యోగం. అందుకొచ్చేది రెండొందల జీతం'

'అయ్యో పిచ్చితల్లీ! జీతాలొట్టే మెతుకులే సరిగారావు యిహ మేడ లెక్కడ్నుంచొస్తై. యీ పైపై పనులన్నీ పై సంపాదనతో తీరాల్సిందే!'

'అయ్యో మోసమా!'

'అబ్బ! అంత అమాయకంగా మాటాడతావేఁమే కూతురా. మా అబ్బాయ్‌మాత్రం సంపాయించటంలా?'

'ఎవరూ...మీ అబ్బాయిగారా. సడేలే. ఆయనకి తల్లో నాలుకా చేతిలో ఎముకా వుంటే మేఁవీ అద్దె కొంపలో ఎందుకు మగ్గుతాం? ఆ జీతంరాళ్లైనా నెల్నెలా గవర్నమెంటువారు పిలిచిస్తున్నారుగనక సరిపోతూంది. లేకపోతే అదీ పుచ్చుకోకుండా అక్కడే పన్చేస్తూ కూచోరూ!!'

సుభద్రతాలూకు యీ దుస్థితికి బాయమ్మ బోల్డు జాలిపడిపోయింది.

తన్నుచూసి జాలిపడేవాళ్లున్నారుగదా అన్న సంతోషంలో సుభద్ర మరింత బాధపడిపోయింది.

* * *

సుబ్బారావుకి డ్యూటీ అంటే యిష్టం.

సుబ్బారావుని బజార్లో చూస్తే 'పాపం ఎవడో వుద్యోగంకోసం తిరుగుతున్నట్టున్నాడ'నుకుంటారు. హాస్పిటల్లో చూస్తే 'చ్చొచ్చొచ్చొ యింత చిన్న వయసులో యెంత పెద్దజబ్బుచేసిందో యేమో అలా అయిపోయేఁడు' అనుకుంటారు ఎటొచ్చీ అతిగాడు ఆ వెడల్పాటి టేబుల్‌వెనకా, లావుపాటి కుర్చీలో ఒదిగి కూచున్నప్పుడే......అతణ్ని చూసి అందరూ డాక్టరనుకునేది. [మనిషి బక్కవాడైనా అతడికి మాంచిబలమైన పేరుంది. అతడి హస్తవాసి మంచిదని అముద్రిత సర్టిఫికెట్లు చాలామంది చాలా యిచ్చేరతడికి]

'డాక్టరు బాబూ...డాక్టరు బాబూ.'

కొత్తసినిమాకి టిక్కెట్లు యిస్తున్నవాడిలా బుర్రొంచుకుని బరబర 'ప్రిస్క్రిప్షన్లు' రాసిస్తున్న సుబ్బారావు తలెత్తేడు. ఎదురుగా మొక్కులు తీర్చుకుందుకు దేవుడిదగ్గరకొచ్చిన భక్తుడ్లా అతివినయంగా (నిలబడి)వున్న వ్యక్తిని గుర్తించేడు—

'ఏం తాతా ఎలా వుంది నీ మనవడికి? పన్లోకెళ్తున్నాడా?'

'తమరి దయవల్ల కులాసాగానే వున్నాడు బాబూ! సావుబతుకుల్లో వున్నవాడిని బతికించి మా కప్పగించారు. తమ ఋణం యీ జన్మలో తీర్చుకోలేం. యీ కాస్త......'—తాత డజను చక్కెరకేళీలూ, తమలపాకులూ, ఆకుల్లో అయిదు రూపాయలూ—మొత్తం కలిపి సుబ్బారావు టేబుల్ మీ దుంచేడు.

సుబ్బారావు వాటిని చూసేడు.

వాటిని తెచ్చిన తాతని చూసేడు. (అజ్ఞానులకు జ్ఞానోపదేశం చేసేప్పుడు బుద్ధుడు కూడా అలాగే చూసుంటాడు!). చూస్తూ అన్నాడు—

'తాతా! మొక్క పెరగాలంటే నీరుపొయ్యాలి. మన మొక్కేగదాఅని మరిన్ని నీళ్లుపోస్తే ఆ మొక్క కాస్తా నీరుకమ్మి చచ్చిపోతుంది. అవునా? నేనైనా అంతే! మీకు వైద్యం చేసినందుకు జీతం తీసుకుంటున్నాను. జీతం తీసుకుంటున్నవాణ్ణి, యిల్లాటి మేతలు మేయటం క్షేమంకాదు—మేపటం నీకు క్షేమంకాదు!!'

'జీతాలు తీసుకుంటున్న వాళంతా యిలా అంటున్నారా బాబూ? యేదో నా సంతోషం కొద్దీ......'

'ఒద్దు తాతా! కానుక లివ్వటం నీకు సంతోషమైతే పుచ్చుకోవటం నా కిష్టం! కాదు గూడదంటే...యిటు చూడూ... నా కివ్వదల్చుకున్న డబ్బుపెట్టి యీ టానిక్కుకొని నీ మనవడిచేత తాగించు. యింకా త్వరగా కోలుకుంటాడు. యీపళ్లు పట్టుకెళ్లి పిల్లలకి పెట్టు!'

తాత డాక్టరిచ్చిన మందుచీటీని, డాక్టరు టేబుల్‌మీది కానుకల్నీ తీసుకున్నాడు, 'దర్మపెబువైన డా. సుబ్బారావుని వెయ్యేళ్లు వర్థిల్లమని నిండుమనసుతో దీవించి, కృతజ్ఞతలు నిండిన కళ్లతో సెలవు తీసుకున్నాడు.

తాత సెలవుపుచ్చుకొని వెళ్లిపోయిన

చాలా సేపటివరకు వెళ్ళిపోని రోగులు—'యీ డాక్టరు డాక్టరుకాడు దేవుడు' 'ఇనుమంటోళ్ళ వూరి కోళ్ళుంటే సాలు దేహం అడక్కుండా బాగు పడి పోద్ది' 'దర్మాస్పత్రిలో యిట్టాంటి దర్మ పెబువుని సూత్తుంటే నేతిబీరకాయలో కూడా నెయ్యుంటుందేవో ననిపిత్తుంది' లాటి మాట లనటం సుబ్బారావు వినగలిగేడు.

సుబ్బారావు వినగలిగిన మాటల్ని అప్పుడే అక్కడికొచ్చిన డాక్టర్ రమేష్‌కూడా వినగలిగేడు—కనుకనే అనగలిగేడు—

'ఏవిటిసార్ వీళ్ల పొగడ్తలు అగడ్తలు దాటు తున్నై. కొంపతీసి పిల్లిళ్ళకెళ్లి వైద్యం చేస్తా నని చెప్పారా యేమిటీ?'

'హ్హాబ్బే అదేవీ లేదండీ! అద్సరే.. మీరీ వేళప్పుడొచ్చేరేవిటీ మీకు మార్నింగ్ డ్యూటీ లేదుగా!'

'మార్నింగ్ డ్యూటీలేదు — యీవెనింగ్ డ్యూటీకిరాను. అది చెప్పేందుకే వచ్చాను!'

'ఏం?'

'ఏం లేదండీ! నేనీపూట వూరెళ్తున్నాను. నాల్రోజుల్దాకా రాను. కాస్త నే వచ్చేవరకు మీ 'కన్నబిడ్డల్ని' సాయంత్రం పూటకూడా చూస్తుండండి!'

'అల్లాగే!'

'అబ్బ ఎక్స్ట్రా నక్కైనా యెంత తేలిగ్గా ఒప్పేసుకున్నార్ సార్!'

'అది నా డ్యూటీ!'

'డ్యూటీలు, ఎక్స్‌ట్రాడ్యూటీలు 'వర్క్'గా చేయటం తప్పనముగాని... చేసూ్తకూడా ఏమీ తీపి కోకపోవటం తప్పంటాను!'

'తీసికోకేం! గవర్నమెంటు జీతమిస్తోందిగా!'

'అబ్బ వస్తోందిలెండి జీతం. దాంతో మహ కొంటే అయిదారుబస్తాల బియ్యం కొనగలం. మరి కూరా నారో!?'

'చూడండి సార్! డాక్టరనేవాడు రోగి పుండు మీది ఈగలా బ్రతగ్గూడదు. రోగిమాటలు చల్లార్చే నవనీతంలా వుండాలి. అది నా ప్రిన్సిపుల్!'

'సర్సరి. నాకు బస్సుకు టైమవుతున్నట్టుంది...'

'వెళ్లిరండి!'

(సశేషం)